# తాగుబోతు మాటలు!

ఒక ఊళ్ళో కట్టెలుకొట్టేవాడు ఒకడు ఉండేవాడు. వాడు పచ్చి తాగుబోతు. ఒకనాడు వాడు అడవిలో కట్టెలు కొట్టుతూ ఉండగా మిట్టమధ్యాహ్నం వేళ వాడికి తగని దాహం వేసింది. చాలాసేపు అడవి అంతా గాలించిన మీదట ఒక చోట రాళ్ళగుట్టల మధ్య కోనేరు కనిపించింది.

వాడు దాహం తీర్చుకుని, "ఈ కోనేరంతా సారాయి అయిపోయి, ఈ రాళ్ళగుట్ట లన్నీ మాంసం గుట్టలైపోతే తృప్తిగా తిని, తాగి, తల పగలగొట్టుకుని చచ్చిపోతాను గద!" అనుకున్నాడు.

వనదేవత వాడి మాటలు విని, వాడి నిజాయితీ పరీక్షింప గోరి కోనేరంతా సారాయి గానూ, రాళ్ళగుట్టలు మాంసం గుట్టలుగానూ మార్చేసింది. కట్టెలుకొట్టేవాడు పొట్ట పట్టి నంత తిని, సారా తాగి, అక్కడే పడుకుని నిద్రపోయాడు.

పొద్దు కూకుతున్నదనగా వాడు నిద్ర లేచి ఇంటికి బయలుదేరుతుంటే, వనదేవత ప్రత్యక్షమై, "నీ కోరిక తీరింది గదా, తల పగలగొట్టుకుని చచ్చావు కావేం?" అని అడిగింది.

"పిచ్చిదానివమ్మా! నమ్మక నమ్మక తాగుబోతు మాటే నమ్మావా?" అంటూ వాడు ఇంటి దారి పట్టాడు.

—కె. కె. రావు.

